# 1

# మెస్సీయయైన యేసు వంశావళి

## (1:1-17)

మత్తయి రాసిన సువార్తలోని ప్రారంభ వాక్యములు (1:1-17) తరుచుగా బైబిలులోని నిష్ప్రయోజనకరమైన వచనములుగా పరిగణింపబడును. ఈ వచనములు అనవసరమైనవని ఎంచుచు, కొందరు విద్యార్థులు వాటిని విడిచిపెట్టి తరువాత భాగమును చదువుటకు ప్రారంభిస్తారు. ఈ వచనములను మత్తయి తన సువార్తలో చేర్చుటకు గల హేతువేమిటి, మరియు అవి ఏయే విషయాల్లో ప్రయోజనకరమైనవిగా ఉంటాయి? సామాన్యంగా చెప్పుకొంటే, బైబిలులోని వంశావళులు ప్రాథమికంగా కుటుంబ సంబంధములను నిర్ధారించు నిమిత్తము ఇవ్వబడినవి. డగ్లస్ ఎస్. హూఫ్‌మాన్ ఇలా వివరించాడు, "యేసు క్రీస్తు జీవితమును గూర్చిన తన నివేదికను ఒక వంశావళితో ప్రారంభించుట, పాత నిబంధనలోని నోవహూ మరియు అబ్రాహాము నివేదికల వంటిదిగా నున్నది, ఈ ఇరువురును వంశావళుల ఉపోద్ఘాతముతో పరిచయము చేయబడ్డారు (ఆదికాండము 5:1-32 మరియు 11:10-32)."[1]

వంశావళులు కుటుంబ సంబంధములను నిర్ధారించును కాబట్టి, అవి ఎల్లప్పుడు కాలక్రమానుగుణంగా సంపూర్తియైనవిగా లేవు; పేర్లు విడిచిపెట్టబడియుండవచ్చును (1:8, 11పై గల వ్యాఖ్యానమును చూడుము). ఈ విధంగా విడిచిపెట్టబడుట పరిశుద్ధ సత్యవేద గ్రంథకర్తలలో ఒక సామాన్య అభ్యాసమై యుండినది. బహూశా రికార్డులలో కొన్ని నిర్దిష్టమైన సంఖ్యలను సాధించవలెనను సదుద్దేశముతో లేదా నిర్దిష్టమైన కొందరు వ్యక్తులు వంశావళిలో పేర్కొనబడుటకు అనర్హులను ఆలోచననుబట్టి కాబోలు కొన్ని తరాలే విడిచిపెట్టబడి యుండవచ్చును. కుటుంబ సంబంధములను స్థాపించుట కొరకు ఈ వంశావళులు సమగ్రమైనవిగా యుండవలసిన అవసరం లేకుండినది.

యూదులు కనాను దేశములో వారి స్వాస్థ్యమును పొందుకొనునట్లు వారి కుటుంబము వారసత్వమును ఋజువు చేయుటకు వారి వంశావళులను ఉపయోగించుకొన్నారు (సంఖ్యాకాండము 26:52-56). బబులోను చెర తరువాత యెరూషలేమునకు తిరిగి వచ్చిన కొందరు యాజకులు "వారి పూర్వీకులు పేర్లు నమోదు చేయబడిన జాబితాలో" వారి కుటుంబ సంబంధిత ఋజువులను కనుగొనలేకపోయారు. తత్ఫలితంగా, "వారు యాజక ధర్మములో నుండి ప్రత్యేకింపబడి అపవిత్రులుగా ఎంచబడిరి" (ఎజ్రా 2:61, 62). గనుక వారి వంశావళులు వారికి అత్యంత ప్రాముఖ్యమైనవై యుండినవని ఋజువగుచున్నది.

మహా హేరోదు, ఒక ఎదోమీయుడు, వంశావళి ప్రాముఖ్యమైనదై యుండిన వారిలో మరొక వ్యక్తియై యుండెను. ఆయన "యూదులు రాజు"గా గుర్తింపబడవలెనని ఆతురపడ్డాడు, గనుక ఆయన తన సింహాసనమునకు ఎదురైన ఎటువంటి పోటీనైనను ఆయన సహించలేదు. ఆయనకు అడ్డువచ్చిన వారిని లేదా, అడ్డు తగులుదురని ఆయన ఊహించుకొనిన వారు ఎవరైనా సరే వారిని, ఆయన సతీమణిని, ఆయన సహోదరులలో ఇద్దరిని, ఆయన సొంత కుమారులలో ముగ్గురిని సహితము ఆయన వధించాడు. "హేరోదు

యొక్క కుమారుడై యుండుట కంటే ఆయన పందియై యుండుటయే ఉత్తమము" అని ఈ మహా హేరోదు గూర్చి కైసరు ఔగుస్తు పలికినట్లు తెలియజేయబడినది.[2] హేరోదు యూదా మతావలంబికుడై దానిని కచ్చితముగా అభ్యసించుచుండినవాడై యుండెను గనుక, ఆయన పందిని చంపడు: కానీ ఆయన తన సొంత కుమారులను చంపుటలో మనసాక్షి లేనివాడై యుండెనని స్పష్టమగుచున్నది. ఆయన తన స్వాధికార స్వార్థమును కాపాడుకొను నిమిత్తము, హేరోదు తన వంశావళుల రికార్డులను ధ్వంసం చేసి,[3] అది తనకు అనుకూలంగా ఉండునట్లు చరిత్రను పునఃరచించాడు. ఈ రాజు – క్రీస్తును ఆరాధించవలెనని తూర్పు దిక్కు నుండి వచ్చిన జ్ఞానుల చేత మోసగింపబడి – "తాను జ్ఞానుల వలన వివరముగా తెలిసికొనిన కాలమునుబట్టి, బేత్లెహేములోను అందలి సకల ప్రాంతములలోను, రెండు సంవత్సరములు మొదలుకొని తక్కువ వయస్సుగల మగపిల్లలందరు వధింపబడవలెనని" ఆజ్ఞాపించినవాడు ఈయనే (మత్తయి 2:16).

పైన పేర్కొనబడిన చారిత్రక నేపథ్యం ఆధారంగా, మత్తయి సువార్తను రచించాడు. మత్తయి రాసిన వంశావళి యొక్క జాడ యోసేపు అనగా, యేసు యొక్క మానవ తండ్రి నుంచి తీయబడినదనియు, లూకా 3:23-38లో ఇవ్వబడిన వంశావళి జాడ మరియ కుటుంబము గుండా తీయబడినదనియు ప్రజాదరణ పొందిన దృష్టికోణము తెలియజెప్పుచున్నది. ఈ సందర్భములో, లూకా తన జాబితాలో మరియ ద్వారా వచ్చిన యేసుక్రీస్తు యొక్క స్వాభావిక అవరోహణమును పేర్కొనుచున్నాడు, మరియు మత్తయి యేసు యొక్క రాజత్వ (లేక న్యాయసమ్మతమైన) వారసత్వాన్ని కలిగిన యోసేపు దత్తత తీసుకొనిన కుమారుని వంశావళిని సమకూర్చుచున్నాడు.[4] యేసు "దావీదు కుమారుడు" గనుక, తత్ఫలితంగా, ఇశ్రాయేలు సింహాసనమునకు ఆయనే న్యాయసమ్మతమైన వారసుడై యుండెనని ఋజువు పర్చుట మత్తయికి అత్యంత ముఖ్యమైన అంశమై యుండినది (1:1). దావీదు సంతానము ద్వారా ఆయన మెస్సీయను ఈ లోకమునకు తెచ్చునని దేవుడు తన ప్రవక్తయైన నాతాను ద్వారా వాగ్దానం చేశాడు (2 సమూయేలు 7:12-16).

**వంశావళులలో గల భేదములు**

| *మత్తయి రాసిన వంశావళి (మత్తయి 1:1-17)* | *లూకా రాసిన వంశావళి (లూకా 3:23-38)* |
|---|---|
| 1. పుస్తకము ఆరంభములోనే కనుగొనగలము | 1. యేసు బాప్తిస్మము తరువాత రాయబడియున్నది |
| 2. విభాగములు – మూడు (14+14+14) | 2. విభాగములు లేవు |
| 3. అబ్రాహాము మొదలుకొని యేసు వరకు | 3. యేసు మొదలుకొని ఆదాము/దేవుని వరకు |
| 4. (వంశావళుల) "పితరుడైన" | 4. (వంశావళుల) "కుమారుడైన" |
| 5. స్త్రీలు, సహోదరులు చేర్చబడి యున్నారు | 5. పూర్వికులు మాత్రమే చేర్చబడియున్నారు |
| 6. వంశ క్రమము దావీదు కుమారుడైన సొలొమోనుతో మొదలౌతుంది | 6. వంశ క్రమము దావీదు కుమారుడైన నాతానుతో మొదలౌతుంది |

## ఉపోద్ఘాతము (1:1)

**[1]అబ్రాహాము కుమారుడగు దావీదు కుమారుడైన, యేసుక్రీస్తు వంశావళి.**

**వచనము 1**. ముమ్ముందు రానున్న వంశావళి వరుస క్రమమునకు ఈ వచనము పరిచయముగా ప్రయోజనకరమైనదై యుంటున్నది. **వంశావళి యొక్క రికార్డు** అను అభివ్యక్తమునకు (*biblos geneseōs*) "ఆవిర్భావములు, లేక ఆరంభముల పుస్తకము" అని అర్థము. ఈ పదజాలము మత్తయి సువార్త అంతటిని సూచించుచున్నను, "పండితోత్తములలో అధిక సంఖ్యాకులు అనుకొనుచున్నట్లు"[5] వంశావళిని మాత్రమే ఎక్కువగా ప్రస్తావించుచున్నది. సెప్టుజింట్ వంశావళి వృక్షములో *genesis* (ఆరంభము/మొదలు) అను పదము తరుచుగా కనిపించుచున్నదను వాస్తవము ఈ తుది అభిప్రాయమునకు తోడ్పడుచున్నది (ఆదికాండము 5:1; 6:9; 10:1, 32; 11:10, 27 చూడుము).

ఈ వంశావళి **మెస్సీయయైన యేసునదై** యున్నది. డోనాల్డ్ ఏ. హేగ్నర్ గమనించిన విషయము ఇలా ఉన్నది. "పాత నిబంధన మరియు యూదీయ సాంప్రదాయములలోని వంశావళులు ఎల్లప్పుడు వారి పేరును ఆనాటి సంతతికి అదివరకటి కారణభూతుడైన వాని నుండి, జాబితాలోని మొట్టమొదటి పేరు నుండి, సంతరించుకొనునని గుర్తించుట ముఖ్యము."[6] ఈ వింత ప్రత్యేకత యేసునకు గల గొప్ప ప్రాముఖ్యతను నొక్కివక్కాణించుచున్నది.

యేసు గ్రీకు భాషలో "క్రీస్తు" (*Christos*) అని పిలువబడుచున్నాడు, అనగా "అభిషిక్తుడైనవాడు" అని దీని అర్థము. గనుక ఇది హెబ్రీ భాషలోని "మెస్సీయ" (*Mashiach*)కు సమానమైనదై యున్నది. "క్రీస్తు" (*Christos*) అను పదము NASB కొన్ని పర్యాయములు మాత్రమే "మెస్సీయ" అని అనువదించుచున్నది (1:1, 16, 17; 2:4; యోహాను 1:41; 4:25). "క్రీస్తు" అను పదము ఆరంభములో యేసునకు ఒక బిరుదై యుండినది, అయితే కాలగమనంలో అది ఒక ద్వితీయ పేరుగా అమలులోనికి వచ్చింది.

మొదటి వచనం, యేసు క్రీస్తు వంశావళిలోని కీలక పాత్రలను ప్రముఖంగా ప్రకటించుచున్నది (1:17పై గల వ్యాఖ్యానమును చూడుము). **దావీదు కుమారుడు** అను పదజాలము యేసును దావీదు సంతానములోనే సుస్థిరంగా వేరుపారజేయుచు, దేవుడు తన వాగ్దానమును నెరవేర్చాడని ప్రదర్శించుచున్నది. 2 సమూయేలు 7:12లో, ఆయన "రాజ్యమును అతనికి [అతని సంతానమునకు] స్థిరపరచెదనని" దేవుడు దావీదునకు సెలవిచ్చాడు (కీర్తనలు 89:29; 132:11; లూకా 1:32; అపొస్తలుల కార్యములు 2:30–36 చూడుము). మత్తయి రాసిన సువార్తలో, "దావీదు కుమారుడు" అను పదజాలము యేసునకు తరచుగా మెస్సీయ సంబంధిత ఒక బిరుదుగా ఉపయోగింపబడినది (9:27; 12:23; 15:22; 20:30, 31; 21:9, 15; 22:42). "దావీదు సంతతివాడుగా ఆయన సింహాసనమును అన్యాయంగా అపహరించడు కానీ చట్టబద్ధమైన దేవుని ప్రజల పరిపాలకుడై యున్నాడు."[7]

యేసు **అబ్రాహాము కుమారుడుగా** కూడ ప్రస్తావింపబడి యున్నాడు. లియోన్ మోర్రిస్ ఇలా వ్యాఖ్యానించుచున్నాడు,

> దేవుడు అబ్రాహాముతో నిబంధన చేసుకొన్నాడు, ఈ నిబంధన ఇశ్రాయేలును దేవుని జనాంగముగా ఒక ప్రత్యేకమైన రీతిలో ప్రత్యేకించినది (ఆదికాండము 12:2–3;

15:17-21; 17:1-14). గనుక వారు ఒక గొప్ప మూలపురుషుని సంతతి వారై యున్నందుకు ఇశ్రాయేలీయులందరును అతిశయించారు, అలాగే క్రైస్తవులు సహితము అతనిని విశ్వాసించినవారికి ఒక ఆదర్శవంతమైన మాదిరియని విశేషంగా ఇష్టపడ్డారు (ఈ విషయాన్ని పౌలు రోమా పత్రికలో ఒక ప్రత్యేకమైన రీతిలో వెల్లడిచేయుచున్నాడు).[8]

ఈ వర్ణన యేసును మూల పితరుడైన అబ్రాహాముతో ఆరంభమయ్యే ఇశ్రాయేలీయుల వంశావళిలో ఉంచుట మాత్రమే కాదు, కానీ దేవుడు అబ్రాహాముతో చేసిన ఆయన వాగ్దానముల నెరవేర్పైయున్నాడని కూడ అది ప్రదర్శించుచున్నది. "భూమి యొక్క సమస్త ఆయన వంశములు నీయందు ఆశీర్వదించబడునని" దేవుడు అబ్రాహాముతో వాగ్దానం చేశాడు (ఆదికాండము 12:3). అటుతరువాత, "భూలోకములోని జనములన్నియు నీ సంతానము వలన ఆశీర్వదింపబడునని" ఆయన అబ్రాహాముకు మాట ఇచ్చాడు (ఆదికాండము 22:18). అబ్రాహాము యొక్క ఆ "సంతానము" క్రీస్తు అని పౌలు వివరించాడు (గలతీయులకు 3:16). ఆయన ద్వారా సమస్త జనములు నిజముగా ఆశీర్వదింపబడినవై యున్నవి (ఆదికాండము 28:18-20 చూడుము).

## పితురులు (1:2-6ఎ)

**2అబ్రాహాము ఇస్సాకును కనెను, ఇస్సాకు యాకోబును కనెను, యాకోబు యూదాను అతని అన్నదమ్ములను కనెను; 3యూదా తామారునందు పెరెసును, జెరహును కనెను; పెరెసు ఎస్రోమును కనెను. 4ఎస్రోము అరామును కనెను, అరాము అమ్మీనాదాబును కనెను, అమ్మీనాదాబు నయస్సోనును కనెను; 5నయస్సోను శల్మానును కనెను, శల్మాను రాహాబునందు బోయజును కనెను, బోయజు రూతునందు ఓబేదును కనెను, ఓబేదు యెష్షయిని కనెను; 6ఎయెష్షయి రాజైన దావీదును కనెను.**

వంశావళిలోని మొదటి భాగము (1:2-6ఎ), అబ్రాహాముతో ఆరంభించి దావీదు వరకు కొనసాగి, ఇశ్రాయేలు మూలపురుషుల జాబితానిచ్చుచున్నది. పాత నిబంధనలో గల వంశావళులతో ఇది ఏకీభవించుచున్నది (రూతు 4:18-22; 1 దినవృత్తాంతములు 1:28, 34; 2:1-15).

**వచనము 2. అబ్రాహాము** కల్దీయుల ప్రదేశములోని ఊర్ నుండి కనాను దేశమునకు వలస వెళ్లవలసినదిగా పిలువబడ్డాడు (ఆదికాండము 15:7; 24:7; అపొస్తలుల కార్యములు 7:2-4). ఆయనకు కలిగిన సంతానము ద్వారా, దేవుడు ఇశ్రాయేలు జనాంగమును నిర్మించనై యున్నాడు; గనుక ఇశ్రాయేలు జనాంగము నుండి క్రీస్తు, లోక రక్షకుడు వచ్చును.

**ఇస్సాకు** దేవుడు అబ్రాహాముకు తన వృద్ధాప్యంలో వాగ్దానం చేసిన కుమారుడై యుండెను (ఆదికాండము 15:4; 21:1-3). దైవీకమైన వాగ్దానములు ఇస్సాకు ద్వారా నెరవేరినవి, ఇష్మాయేలు ద్వారా కాదు (ఆదికాండము 16:1-16; 17:15-22).

ఇస్సాకుకు ఇద్దరు కవల మగపిల్లలు, ఏశావు మరియు **యాకోబు** తొలి సంతానము కాకపోయినప్పటికిని, దేవుడు తన వాగ్దాన జనాంగమును నిర్మించుటకు అతడే దేవుని చేత ఏర్పరచుకొన్నవాడై యుండెను (ఆదికాండము 25:23).

యాకోబు పన్నెండు మంది కుమారులను కన్నాడు, వారిలో ఒకని పేరు యూదా,

**యూదా,** రాజత్వపు గోత్రమగునని యాకోబు ప్రవచించాడు: "యూదా కొదమ సింహము ... షిలోహు వచ్చువరకు, యూదా యొద్ద నుండి దండము తొలగదు, అతని కాళ్ల మధ్య నుండి రాజదండము తొలగదు, ప్రజలు అతనికి విధేయులై యుందురు" (ఆదికాండము 49:9, 10). రాజైన దావీదు (1:6ఎ) మరియు అతని సంతానము, వంశావళిలోని రెండవ విభాగములో చేరియున్నవారు (1:6బి–11), అందరును యూదా వంశస్థులై యుండిరి, చివరకు, యేసు, "దావీదుకు చిగురైన యూదా గోత్రపు సింహమై యున్నాడు" (ప్రకటన 5:5).

అతని **అన్నదమ్ములు** అను పదజాలము ఈ వంశావళిలో కనిపించుచున్నది, "ఏలయనగా పన్నెండు మంది మూలపురుషులను కలిపి మాటలాడుకొనుట అదొక ఆచారపు అలవాటై యుండినది లేదా పన్నెండు గోత్రములన్నిటికి సంబంధించిన సంతానము ఇశ్రాయేలీయులై యుండిరి గనుక మెస్సీయ యందు సమానమైన ఆసక్తి కలిగియుండిరి."[9] సహేతుకమైనదని కనిపించుచున్న మరొక వివరము ప్రకారము, "సాధ్యమయ్యే అనేక రాజత్వ వంశస్థులలో యూదా గోత్రము మాత్రమే ఏర్పరచుకొనబడినదని (ఆదికాండము 49:10)" ఈ పదజాలము సూచించుచున్నది.[10]

**వచనము 3. యూదా తామారునందు పెరెసును, జెరహును కనెను.** పెరెసు మరియు జెరహు ఈ ఇద్దరు పేర్కొనబడి యున్న వాస్తవము బహుశా వారు గర్భములను దాల్చుటలో గల అసమానమైన పరిస్థితులను ప్రతిబింబించుచుండవచ్చును. ఒకడు తన సహోదరుడు మరణించినట్లయితే విధవరాలైన అతని భార్యను అతడు పరిణయమాడాల్సిన ఆచారం ప్రకారంగా యూదా తన కోడలు తామారు యెడల నడుచుకోలేదు, గనుక ఆమె ఒక వేశ్య వేషము వేసుకొని అతనిని మరులుగొల్పినది, ఆచారం ప్రకారంగా యూదా తన కోడలు తామారును వివాహమాడలేదు, తత్ఫలితంగా యూదా ఆ ఇద్దరు కుమారులకు తండ్రి అయ్యాడు (ఆదికాండము 38:1–30).

యేసు క్రీస్తు వంశావళిలో పేర్కొనబడిన ఐదుగురు స్త్రీలలో తామారు మొదటి స్త్రీ, మరియ చివరి స్త్రీ (1:3, 5, 6, 16).[11] మొదటి నలుగురు స్త్రీలు – తామారు, రాహాబు, రూతు, మరియు బత్సెబ – అసమానమైన పరిస్థితుల చేత చుట్టుముట్టబడి యుండిరి. హూఫ్మన్ ఇలా రాయుచున్నాడు, "ప్రతి ఒక్క స్త్రీ తనతో లైంగికంగా సంభోగించిన పురుషుని గూర్చి ఏదో ఒక ఎబ్బెట్టైన లేదా అసాధారణమైన – అపఖ్యాతిపాలుజేయు విషయము సహితము – అంశము కలిగియుండినది, మరియు ప్రతి ఒక్క స్త్రీ దేవుని ప్రణాళికలో ప్రముఖ్యమైన పాత్ర వహించినది (కొందరు వారి సొంత చొరవతో వారి పాత్రను వహించారు గనుక తరుచుగా గొప్ప ప్రాణాపాయముండినది)."[12] ప్రతి ఒక్కరి సందర్భములో, వారి "కళంకము అటుతరువాత తొలగింపబడినది."[13]

దేవుని ప్రణాళిక చొప్పున మరియ వహించిన అసమానమైన పాత్రకు ఈ నలుగురు స్త్రీలు కూడ ఎదో ఒక విధంగా రాబోవుచుండిన ఛాయగా ఉండిరనునది సంభావ్యమై యున్నది. పరిసయ్యులు పాటించుచుండిన సాంప్రదాయము ప్రకారంగాను, మెస్సీయ సంబంధిత ఎదురుచూపుల్లోను వారు మహిమపర్చబడుచున్నారు గనుక, యూదా నాయకులు యేసును తృణీకరించుటకు వ్యతిరేకంగా వాదించుటకును, యేసు జన్మించిన పరిస్థితుల విషయంలో అభ్యంతరములు ఎటువంటివైనను, అవి ఏవైనను ఎదురు దాడి చేయుటకును బహుశా

మత్తయి వారిని ప్రయోగించియుండవచ్చును.[14] ఇంకా, ఈ నలుగురు స్త్రీలు సహితము, సమస్త జనులు నిమిత్తమైన యేసు క్రీస్తు యొక్క కార్యభారమును సూచించుచుండిన అన్యజనులై యుండవచ్చును.

**పెరెసు,** కవల పిల్లలలో మొదటివాడు, దావీదు యొక్క రాజ వంశమునుండి వచ్చిన వాని కుమారుడై యుండెను (రూతు 4:12, 18–22). అతడు ఐగుప్తుకు వెళ్లిన యాకోబు సంతానములో ఉండినవాడు, **హెస్రోనును** కనెను (ఆదికాండము 46:8, 12). ఆతని కుమారుడు **ఆరాము** ఐగుప్తులో జన్మించియుండును.

**వచనము 4. ఆరాము** మరియు **అమ్మీనాదాబుకు** నడుమ అనేక తరాలు ఉండియుండుట, అత్యధికంగా సంభావ్యమై యున్నది, ఇశ్రాయేలీయులు ఐగుప్తులో గడిపిన 430 సంవత్సరములు గూర్చి వివరించుటకు ఈ విషయము తోడ్పడును (నిర్గమకాండము 12:40, 41). ఆయన రచించిన వంశావళిలో లూకా "అద్మిన్" అను పేరును చేర్చుచున్నాడు (ఆంగ్ల బైబిల్ చూడండి – లూకా 3:33), తద్వారా ఆ కాలములోని కనీసము ఒక తరమునైనా ప్రతిబింబించుచున్నాడు. అమ్మీనాదాబు, అహరోను యొక్క మామ (నిర్గమకాండము 6:23), ఈయన ఇశ్రాయేలీయులకు ప్రధాన యాజకుడయ్యాడు.

ఇశ్రాయేలీయులు ఐగుప్తు నుండి నిర్గమించుచుండిన సమయంలో, అమ్మీనాదాబు కుమారుడు **నయస్సోను** యూదా గోత్రమునకు నాయకుడై యుండెను (సంఖ్యాకాండము 2:3, 4), ఈయన తొలి జనాభా లెక్కలలో నిమగ్నుడైయుండెను (సంఖ్యాకాండము 1:7). నూతనంగా నిర్మింపబడిన గుడారములోనికి బల్యర్పణలు తెచ్చుచుండెను (సంఖ్యాకాండము 7:12–17), వారి గోత్రపు జనులు అరణ్యములో సంచరించుచు ఒక నూతన స్థలమునకు వెళ్లుచుండినప్పుడు నాయకత్వము వహించాడు (సంఖ్యాకాండము 10:14).

నయస్సోను కుమారుడు **శల్మాను,** యెహోషువ నాయకత్వంలో కనాను దేశము జయింపబడిన పోరాటములో పోరాడినట్లు తెలియుచున్నది. 3 మరియు 4 వచనములో పేర్కొనబడిన అనేకుల వలనే, అతని గూర్చి మనకు పాత నిబంధనలో తెలియజెప్పబడుచున్నది అంతంత మాత్రమే.

**వచనము 5. శల్మాను రాహాబునందు బోయజును కనెను.** విజయమొందిన సమయంలో రాహాబు, యెరికో పట్టణములోని ఒక వేశ్య. వారు శత్రువుల చేతికి దొరికిపోయి ఉరితీయబడుటకు కచ్చితమైన అవకాశములుండిన సందర్భంలో, ఆమె ఇశ్రాయేలీయులకు సంబంధించిన వేగులవారిని దాచిపెట్టినది (యెహోషువ 2:1–7), ఈ ఇరువురి వేగులవారి ప్రాణాలు రక్షించుటకు ఆమె తన ముందుండిన ప్రమాదకరమైన పరిస్థితికి తన ప్రాణాన్నే అప్పగించుకొన్నది. ఇశ్రాయేలీయులు యెరికోపట్టణమును చేజిక్కించుకొన్నప్పుడు, ఆమె దేవునియందుంచిన విశ్వాసమునుబట్టి రాహాబు మరియు ఆమె కుటుంబ సభ్యులు కాపాడబడిరి (హెబ్రీయులకు 11:31; యాకోబు 2:25). ఆమె అటుతరువాత శల్మానును పరిణయమాడి, బోయజు అని నామకరణము చేయబడిన కుమారుని కన్నది (రూతు 4:20, 21).

**బోయజు రూతునందు ఓబేదును కనెను.** అద్భుతకరమైన ఈ కథ రూతు గ్రంథంలో వివరింపబడి యున్నది. బోయజు, బేత్లెహేములో ప్రముఖుడైన పౌరుడై యుండినవాడు, బీదరాలు మరియు విధవరాలై యుండిన తన బంధువు రూతు యెడల కనికరము

కనుపర్చాడు. బోయజును వివాహమాడవలెనని ఆమెకుండిన ఇచ్ఛను తెలియజెప్పుటకు కళ్లము యొద్దకు వెళ్లుట ద్వారా ప్రాణాపాయమును ఎదుర్కొన్నది (రూతు 3:6–14). అటుతరువాత ఆమె ఓబేదుకు జన్మనిచ్చుట ద్వారా దావీదు సంతతిని పొడిగించినది (రూతు 4:1–17). వంశావళిని మరియ వరకు తీసుకొనివెళ్లిన నలుగురు స్త్రీల జాబితాలో, రూతు మాత్రమే ఒక సుగుణవంతురాలై యుండినదని ప్రస్తావించవచ్చును. ఆమె విగ్రహారాధికులైన మోయాబీయులలోనుండి వచ్చినప్పటికిని (ద్వితీయోపదేశకాండము 23:3 చూడుము), "ఆమె యోగ్యురాలై యుండినది" (రూతు 3:11).

**ఓబేదు యెష్షయిని కనెను.** ఓబేదునకును యెష్షయికిని మధ్యలో అనేక తరాలు విడిచిపెట్టబడినట్లు స్పష్టమగుచున్నది, న్యాయాధిపతుల రోజుల్లోని కొన్ని వందల సంవత్సరముల కాలము గూర్చి ఇది వివరించును (న్యాయాధిపతులు 11:26; 1 రాజులు 6:1). యెష్షయి, ఎనమండుగురు కుమారుల తండ్రి, బేత్లెహేములో నివసించుచుండెను, ఆయన గొఱ్ఱెల మందనొకటి కలిగియుండెను (1 సమూయేలు 16:1–13; 17:12–18).

**వచనము 6ఎ.** యెష్షయి యొక్క కుమారులందరిలో కనిష్టుడు, దావీదు దేవుని చేత ఏర్పరచుకొనబడిన ప్రవక్తయైన సమూయేలు చేత అభిషేకింపబడెను (1 సమూయేలు 16:11–13). యేసు క్రీస్తు వంశావళిలో దావీదు తరువాత శ్రేణిలోనివారు సహితము రాజులై యుండినప్పటికిని, దావీదు మాత్రమే రాజుగా గుర్తింపబడినాడు (1:6బి–11). ఈ సాహిత్య సంబంధమైన అంశము, ఉపోద్ఘాతములోని ప్రకటనలోని ప్రకటనలను దృష్టిలో ఉంచుకొనుటతో (1:1), రాజైన దావీదునకును మెస్సీయకును మధ్య ఒక బలమైన బంధమును ఏర్పరచుచున్నది (1:16, 17). కాబట్టి, దావీదు "ఒక నమూనాగా ప్రయోజనకారి యగుచున్నాడు."[15]

## దావీదు వంశపు రాజులు
## (1:6బి–11)

**[6బి]ఊరియా భార్యగానుండిన ఆమెయందు దావీదు సొలొమోనును కనెను, [7]సొలొమోను రెహబామును కనెను. రెహబాము అబీయాను కనెను, అబీయా ఆసాను కనెను; [8]ఆసా యెహోషాపాతును కనెను; యెహోషాపాతు యెహోరామును కనెను, యెహోరాము ఉజ్జియాను కనెను; [9]ఉజ్జియా యోతామును కనెను, యోతాము ఆహాజును కనెను, ఆహాజు హిజ్కియాను కనెను; [10]హిజ్కియా మనష్షేను ఆమోనును కనెను, ఆమోను యోషీయాను కనెను; [11]యూదులు బబులోనుకు కొనిపోబడిన కాలములో యోషీయా యెకొన్యాను అతని సహోదరులను కనెను.**

వంశావళిలోని రెండవ గుంపు యొక్క పేర్లు (1:6బి–11) దావీదు మొదులుకొని తదనంతరము వచ్చిన రాజుల జాబితాయై యున్నది. సొలొమోను మొదలుకొని యెకొన్యా వరకు గల శ్రేణి "రాజు వంశము పరంపర యొక్క వైభవం మరియు దాని పతనము గురించినదై యుండినది."[16]

**వచనము 6బి. ఊరియా భార్యగా నుండిన బత్షెబయందు దావీదు సొలొమోనును కనెను.** "దావీదు, ఊరియాకు సంబంధించిన స్త్రీయందు కనిన సొలొమోను యొక్క తండ్రియై

యుండెనని" గ్రీకు గ్రంథ వాక్యభాగం మరి ఎక్కువ అక్షరార్థముగా తెలియజెప్పుచున్నది. అందులో "బత్సెబ" అని గాని, భార్య అని గాని పేర్కొనబడలేదు, అట్లయినను స్పష్టత కొరకు NASB అనువాదము ఈ మాటలను చేర్చుచున్నది. దావీదు బత్సెబతో వ్యభిచరించి, అటుతరువాత ఆమె భర్తయైన ఊరియాను హతమార్చుటకు పన్నిన పన్నాగము, అంతమాత్రమే గాక ప్రవక్తయైన నాతాను దావీదును గద్దించుట గూర్చిన కథ అందరికిని సుపరిచితమైన అంశమే (2 సమూయేలు 11:1-12:15ఎ). ఈ పరిస్థితులు దావీదు పశ్చాత్తాపపడుటకు దారితీసినవి, ఇది కీర్తనలు 51లో అభివ్యక్తము చేయబడి యున్నది.

దావీదు మరియు బత్సెబకు కలిగిన తొలి సంతానము మరణించినప్పటికిని, వారు రెండవ కుమారుని కని, వానికి సొలొమోను అని నామకరణము చేసారు (2 సమూయేలు 12:15బి-25). దావీదుకు యింకా యితరమైన భార్యలు మరియు పిల్లలు అనేకులుండిరి - వారిలో దావీదు సింహాసనము కొరకు పోటీపడినవారు లేకపోలేదు. కాబట్టి బత్సెబ యొక్క చొరవ చొప్పుననే, ప్రవక్తయైన నాతానుతో కూడ, ఆమె కుమారుడైన సొలొమోను రాజయ్యాడు (1 రాజులు 1:11-31). జే. డబ్లు. మెక్‌గార్వే గమనించిన విషయం ఇలా ఉన్నది, "బత్సెబ, హేతువుకందని దేవుని కటాక్షముతో కూడిన కార్యముల ద్వారా, దావీదు సింహాసనమునకు వారసులైనవారికి తల్లి అయ్యింది."[17]

దావీదు బత్సెబ మరొక కుమారుని కన్నది, వాని పేరు నాతాను (2 సమూయేలు 5:14; 1 దినవృత్తాంతములు 3:5). లూకా రచించిన వంశావళి యేసు క్రీస్తు యొక్క వారసత్వము జాడను సొలొమోను కంటే నాతాను ద్వారా వెలికి తీయుచున్నది (లూకా 3:31).

**వచనము 7. సొలొమోను** ఆరంభంలో "యెహోవా యందు ప్రేమ యుంచెను," మరియు "అతని హృదయమును ఇతర దేవతల తట్టు త్రిప్పిన అనేక మంది అన్యులైన స్త్రీలను కూడ ప్రేమించాడు" (1 రాజులు 3:3; 11:1-13). సొలొమోను అభ్యసించుచుండిన విగ్రహారాధనకు పర్యవసానముగా, ఇశ్రాయేలు రాజ్యము ఎట్టకేలకు తునాతునకలయ్యింది (1 రాజులు 11:26-40). సొలొమోను కుమారుడైన **రెహబాము** స్వదేశ పరిపాలనలో తండ్రిని మించిన తనయుడుగా, తండ్రి కంటే కఠినమైన విధానమును అవలంబించాడు, గనుక ఉత్తరమున నివసించుచుండిన గోత్రములవారు యరొబాము నాయకత్వంలో అతని మీదికి తిరుగుబాటు చేశారు (1 రాజులు 12:1-24). కాబట్టి, రెహబాము మొదలుకొని యెకొన్యా వరకు వంశావళిలో నమోదుచేయబడిన రాజులు (1:7-11) దక్షిణమున ఉండిన యూదా ప్రదేశమును మాత్రమే పరిపాలించారు.

రెహబాము, తన తండ్రియైన సొలొమోను వలేనే, విగ్రహారాధన చేత ప్రభావితమయ్యాడు. ఆయన రాజ్యమందలి ప్రజలు ఉన్నత స్థలములను, బలిపీఠములను, దేవతాస్తంభములను, మరియు పురుషగాములను వారి మత సంబంధమైన అభ్యాసములలోనికి అనుమతించారు. "రెహబాము పరిపాలనలో అతని తల్లి నయమాయను ఒక అమ్మోనీయురాలు" అను ఒక ప్రకటనతో అదే తరగతిలోనికి చేర్చబడుచున్నవి (1 రాజులు 14:21-31).

అబీయా, కొంత కాలము మాత్రమే పరిపాలించినవాడు, తన తండ్రియైన రెహబాము అడుగుజాడల్లో నడుచుకొన్నాడు (1 రాజులు 15:1-8). దీనికి విరుద్ధముగా అబీయా కుమారుడు ఆసా, దేవతాస్తంభములను, పురుషగాములను, రాజ్యములనుండి తొలగించి దేవుని దృష్టికి ఏది యుక్తమో దానిని ఆచరించాడు. అతడు తన స్వంత తల్లియైన మయకా

సైతం (బహుశా అమ్మమ్మ అయివుండవచ్చును) రాజమాత స్థానమునుండి ఆమె చేయు విగ్రహారాధన కారణముగా తొలగించబూనాడు (1 రాజులు 15:9-15).

**వచనము 8.** ఆసా కుమారుడు **యెహోషాపాతు** కూడ ఒక మంచి రాజై యుండెను, తన తండ్రి అడుగుజాడల్లో నడుచుకొనుచుండెను. అతడు ఇశ్రాయేలుతో సమాధానము కుదుర్చుకొన్నాడు (1 రాజులు 22:41-44). ఏదిఏమైనా, అతని పరిపాలనా కాలంలో ప్రజలు యింకను ఉన్నత స్థలములందు ఆరాధనలు చేయుచుండిరి.

యెహోషాపాతు కుమారుడు యెహోరాము (యెరాము) కూడ మంచి రాజు కాదు. అతడు ఇశ్రాయేలీయుల చెడు రాజైన అహాబు కుమార్తెయైన అతల్యాను పెండ్లి చేసుకొనెను (2 రాజులు 8:16-19).

ఈ సమయంలో, మత్తయి రాసిన వంశావళిలో మరొక వెలితి ఏర్పడినది (1:4, 5 చూడుము). **యెహోరాము** మరియు **ఉజ్జియా** (అజర్యా[18]) మధ్యకాలంలో, యూదులు ముగ్గురు అదనపు రాజులుండిరి: అహజ్యా, యోవాషు, మరియు అమజ్యా (1 దినవృత్తాంతములు 3:11, 12; చూడుము 2 రాజులు 8:25-27; 12:1-21; 14:1-22). ఆమె తన కుమారుడైన అహజ్యా మరణాంతరము, దుర్మార్గురాలైన రాణి అతల్యా, సింహాసనమును అన్యాయముగా అక్రమించుకొనుటకును, తద్వారా దావీదు వంశావళిని నాశనము చేయుటకును ప్రయత్నించెను (2 రాజులు 11). ఏదిఏమైనా, యౌవ్వనుడైన యోవాషు (అతల్యా యొక్క సొంత మనుమడు) సంరక్షింపబడినవాడై అటుతరువాత యూదా రాజ్యము సింహాసనాసీనుడయ్యాడు. అతడు తన పరిపాలనా కాలంలో చేసిన యెరూషలేము దేవాలయ మరమ్మత్తులనుబట్టి చిరస్మరణీయుడుగా నిలిచాడు (2 రాజులు 12). యోవాషు మరియు అతని కుమారుడు అమజ్యా మంచి రాజులుగా స్మరించుకొనబడుచుండిరి (2 రాజులు 12:2; 14:1-3).

**వచనము 9.** ఉజ్జియా మరియు అతని కుమారుడు యోతాము కూడ, "యెహోవా దృష్టికి నీతిగలవాడై" ప్రవర్తించుటనుబట్టి నిర్మాణాత్మకమైనవారుగా స్మరించుకొనబడిరి (2 రాజులు 15:3, 34). ఏదిఎమైనా, అన్యమతారాధికుల ప్రభావం దాని ప్రతాపాన్ని అత్యాధికంగా చూపించుచుండినది గనుక యూదా ప్రజలు యింకను ఉన్నత స్థలములందు ఆరాధించుచుండిరి (2 రాజులు 15:4, 35). అంతమాత్రమేగాక, దేవుడు ఉజ్జియాను అతని అహంకారమునుబట్టి అతనిని కుష్ఠువ్యాధితో మొత్తాడు: అతడు దేవాలయములో ధూపపీఠము మీద ధూపమువేయుటకై ప్రయత్నించాడు. ఇట్టి ప్రత్యేకార్హత మరియు అధికారము కేవలము న్యాయసమ్మతమైన యాజకులకు మాత్రమే ఉండినది (2 దినవృత్తాంతములు 26:16-21).

యోతాము కుమారుడు ఆహాజు అన్యమతారాధనలో నిమగ్నమయ్యాడు, అది చాలదన్నట్లు తన సొంత కుమారున్నే బల్యర్పణగా అగ్నికి ఆహుతి గావించాడు - దేవుని దృష్టికి ఇదొక హేయమైన కార్యమై యుండినది (2 రాజులు 16:1-4)! అతడు దేవాలయము కొరకు అన్యమాతారాధనా పద్ధతి ప్రకారం దమస్కులో ఒక క్రొత్త బలిపీఠమును కట్టించాడు. అంతమాత్రమే గాక, అతడు దేవాలయములో ఇతర మార్పులను కూడ చేసాడు, అతడు దేవుని సంతోషపర్చుటకు ఆందోళన చెందుచుండెనని ఈ పనులు సూచించుచున్నవి (2 రాజులు 16:10-20).

ఆహాజు కుమారుడు హిజ్కియా దేవుని యెడల విశ్వసనీయమైనవాడై యుండెను, ఉన్నత

స్థలములను నాశనము చేసాడు, విగ్రహములను పగులగొట్టించాడు, దేవతా స్థంభములను పడగొట్టించాడు. ఒక విగ్రహముగా కొలువబడుచుండినది – మోషే చేసిన ఇత్తడి సర్పమును ఛిన్నాభిన్నములుగా చేసాడు (2 రాజులు 18:1–8). ఆయన క్రీ.పూ. 722లో యూదా దేశమును పరిపాలించుచుండెను, ఇశ్రాయేలీయులు అష్షూరీయుల చేత చెరగా పట్టుకొనబడినది ఈ సమయంలోనే (2 రాజులు 18:9–12). వెనువెంటనే, దేవుడు హిజ్కియాను మరియు యెరూషలేము పట్టణమును ఇటువంటి పరిస్థితిలో నుండే అద్భుతంగా విడిపించాడు, 185,000 మంది అష్షూరీయులను హతమార్చాడు (2 రాజులు 18:13–19:37). ముట్టడి సమయమంతా సరిపడునట్లు యెరూషలేము పట్టణమునకు అవసరమైయుండిన నీటి సరఫరా నిమిత్తము అతడు త్రవ్వించిన సొరంగమునుబట్టి హిజ్కియా స్మరణకు తెచ్చుకొనబడును (2 రాజులు 20:20). ఈ సొరంగము నేటికిని చూడనగును.

**వచనము 10.** హిజ్కియా కుమారుడు **మనష్షే** ఉన్నత స్థలములను, బయలు దేవతా బలిపీఠములను మరియు దేవతా స్తంభములను పునఃనిర్మించుట ద్వారా దేవుని దృష్టికి చెడు నడత నడిచాడు. ఆయన దేవుని ఆలయములో నక్షత్రములను ఆరాధించాడు. అది చాలదన్నట్లు తన సొంత కుమారుని అగ్ని గుండములో బల్యర్పణ గావించాడు (2 రాజులు 21:1–6). రాజు మరియు రాజ్యములోని ప్రజలు ఇంతటి ఘోరమైన దుష్కార్యములను అభ్యసించుచుండినందునుబట్టి, దేవుడు యూదా దేశము చెరగా కొనిపోబడునట్లు చేసాడు (2 రాజులు 21:10–16). మనష్షే కుమారుడు **ఆమోను** ఇంత కంటె మరీ ఘోరమైనవాడై యుండెను; అతని దాసులే అతనికి విరోధముగా కుట్ర పన్నారు, హతమార్చారు (2 రాజులు 21:19–24).

ఆమోను కుమారుడు **యోషీయా,** ఎనిమిది సంవత్సరముల ప్రాయములోనే రాజయ్యాడు, సంపూర్తిగా భిన్నమైన స్ఫూర్తి కలిగియుండినాడు. ధర్మశాస్త్ర గ్రంథము దేవాలయములో దొరికిన తరువాత, యోషీయా ఒక పునఃరుద్ధణ మహోద్యమమును చేపట్టాడు (2 రాజులు 22:1–23:25). ప్రజలందరి యెదుట యెహోవా ధర్మశాస్త్రము చదువునట్లును, ప్రజలందరు దేవునితో తమ నిబంధనను నవీకరణము చేసికొనునట్లు ను ఏర్పటు చేశాడు. అసంఖ్యామైన వస్తువులను (ప్రతిమలను, బలిపీఠములను, దేవతా విగ్రహములను మరియు పాత్రలను) నిర్మూలించాడు మరియు ప్రజలను (యాజకులను, పురుషగాములను, కర్ణపిశాచిగలవారిని, సోదెచెప్పువారిని) తొలిగించాడు.

**వచనము 11. యోషీయా** పరిపాలనా కాలంలో నిర్మాణాత్మకమైన మార్పులు చేయబడినప్పటికిని, దేశముపై తన ఉగ్రత కొరడాను ఘళిపించుటకు దేవుడు తీర్మానించుకొన్నాడు (2 రాజులు 23:26, 27). మరొకసారి మత్తయి ఆయన సమకూర్చిన వంశావళి జాబితాలో మరొక తరమును విడిచిపెట్టాడు. ఉదా॥ యోషీయా కుమారుడు ఎల్యాకీము (యెహోయాకీము) (చూడుము 2 రాజలు 23:34–24:6; 1 దినవృత్తాంతములు 3:15, 16).[19] **బబులోను దేశమునకు బహిష్కరింపబడిన సమయంలో** ఎల్యాకీము కుమారుడు యెకొన్యా (యెహోయాకీను). రాజ్యమేలుచుండెను. ఈ "దేశబహిష్కరణ" క్రీ.పూ. 597లో జరిగినది; అప్పుడు రాజు కుటుంబము సభ్యులలోని ఎక్కువ మంది సభ్యులు బబులోనుకు చెరగా కొనిపోబడిరి (2 రాజులు 24:8–16). **అతని అన్నదమ్ములు** అను పదజాలము వారు అక్షరాలా అన్నదమ్ములై యుండిరని సూచింపవచ్చును (1:2 చూడుము)

లేదా బహూశా, “అతని పరివారమును దేశములోని గొప్పవారును” అయియుండవచ్చును (2 రాజులు 24:15).

ఇదే సందర్భములో, యెకొన్యా యొక్క పినతండ్రియైను మత్తన్యా, ఇతని పేరు రాజైన నెబుకద్నెజరు చేత సిద్కియా అని మార్చబడి, సింహాసనాసీనుడుగా చేయబడెను. ఈయన పదకొండు సంవత్సరములు అనగా, క్రీ.పూ. 586లో నెబుకద్నెజరు సైన్యము వచ్చి యెరూషలేమును మరియు దేవాలయమును నాశమును చేయునంత వరకు పరిపాలించాడు. అతడు తిరుగుబాటు చేసినందుకు తన సొంత కుమారులే హతమార్చబడుటను సిద్కియా తన కళ్లారా చూసాడు అప్పుడు అతని కళ్లు ఊడబెరకబడినవి. సిద్కియా మరియు యూదా ప్రజలలో శేషించినవారిలో అనేకులు బబులోనుకు చెరగా కొనిపోబడ్డారు (2 రాజులు 24:17–25:21).[20] ఈయనకు యేసు క్రీస్తు వంశావళితో ప్రత్యక్ష సంబంధము లేనందునుబట్టి ఈయన పేరు మత్తయి సమకూర్చిన వంశావళిలో రాయబడలేదు.

## దావీదు వారసులు
## (1:12–16)

**[12]బబులోనుకు కొనిపోబడిన తరువాత యెకొన్యా షయల్తీయేలును కనెను, షయల్తీయేలు జెరుబ్బాబెలును కనెను; [13]జెరుబ్బాబెలు అబీహూదును కనెను, అబీహూదు ఎల్యాకీమును కనెను, ఎల్యాకీము అజోరును కనెను; [14]అజోరు సాదోకును కనెను, సాదోకు ఆకీమును కనెను. ఆకీము ఎలీహూదును కనెను. [15]ఎలీహూదు ఎలియాజరును కనెను, ఎలియాజరు మత్తానును కనెను, మత్తాను యాకోబును కనెను; [16]యాకోబు మరియ భర్తయైన యోసేపును కనెను, ఆమెయందు క్రీస్తు అనబడిన యేసు పుట్టెను.**

వంశావళిలో ఈ మూడవ విభాగము (1:12–16) దావీదు యొక్క తరువాత వారసులను తన జాబితాలో చేర్చుకొనుచున్నది, వీరు యెరూషలేములో అతని సింహాసనము నలంకరించి దేశమును పరిపాలించలేదు. దాదాపుగా ఆరు వందల సంవత్సర కాలమును చుట్టివచ్చుచ్చు చివరకు మెస్సీయయైన యేసు జననముతో అత్యున్న స్థితికి చేరుకొనుచున్నది.

**వచనము 12**. వంశావళిలోని మొదటి విభాగము నుండి రెండవ విభాగమునకు (1:6ఎ, 6బి), మధ్యంతర మార్పు చేయుటకు “దావీదు” ఉపయోగించుకొనపడుచున్నట్లుగా, రెండవ విభాగము నుండి మూడవ విభాగమునకు వెళ్లుటకు **యెకొన్యా మరియు బబులోనుకు దేశ బహిష్కరణ గావింపబడుట** గూర్చిన సంఘటన ఉపయోగింపబడుచున్నది (1:11, 12; 1:17 పై గల వ్యాఖ్యానమును చూడుము). ఇచ్చట ప్రస్తావన “దేశ బహిష్కరణ ప్రారంభింపబడిన తరువాత కాలమునకు సంబంధించినదై యున్నది. దేశబహిష్కరణ ముగిసిన కాలమునకు కాదు.”[21]

మత్తయి యేసు క్రీస్తు వంశావళిలో యెకొన్యాను మరియు అతని సంతానమును చేర్చుచున్నాడు. ఇది గమనార్హమైన విషయమైయున్నది, ఏలయనగా దేవుడు ప్రవక్తయైన యిర్మీయా నోట ఇలా పలికాడు, “యెహోవా ఈలాగు సెలవిచ్చుచున్నాడు, ‘సంతానహీనుడనియు, తన దినములలో వర్ధిల్లనివాడనియు ఈ మనుష్యుని గూర్చి రాయుడి; అతని సంతానములో ఎవడును వర్ధిల్లడు, వానిలో ఎవడును దావీదు సింహాసనమందు కూర్చుండడు; ఇక మీదట

ఎవడును యూదాలో రాజుగా నుండడు' " (యిర్మీయా 22:30). దీనిని మెక్‌గార్వే ఇలా వివరించాడు, "అతడు సంతానహీనుడై యుండుననగా, అతని తరువాత సింహాసనాసీడగుటకు అతనికి పుత్రులెవరును జన్మించరని అర్థము."[22]

ఈ వాంగ్మూలము దృష్ట్యా, యేసు యెరూషలేములో ఒక సింహాసనముపై ఆసీనుడై ఇహలోక రాజ్యమునొకదానినీ పరిపాలించడు. ఆయన ఈనాడు దావీదు సింహాసనంపై ఆసీనుడై పరలోకము నుండి పరిపాలించుచున్నాడు (అపొస్తలుల కార్యములు 2:29-36). ఆయన పరిపాలన పెంతెకొస్తు దినాన, ఆయన సంఘము/రాజ్యము ఈ లోకములోనికి వచ్చినప్పుడు, ఆరంభమయ్యింది. యేసు మధ్యాకాశ మేఘాల్లో తిరిగి వచ్చినప్పుడు, ఆయన ఈ రాజ్యమును తండ్రియైన దేవుని చేతికి అప్పగించును (1 కొరింథీయులకు 15:23-26; 1 థెస్సలొనీకయులకు 4:16, 17).

యెకొన్యా యొక్క ఏడుగురు కుమారులు ("బందీలుగా నున్నవారు") పాత నిబంధనలోని వంశావళి జాబితాలో చేర్చబడి యున్నారు, వీరిలో **షయల్తీయేలు** పేరు అగ్రస్థానంలో ఉంది (1 దినవృత్తాంతములు 3:17, 18).[23] మేసోరెటిక్ గ్రంథ వాక్య భాగములో (సార్వత్రికముగా అంగీకరింపబడుచున్న యూదీయ బైబిల్ యొక్క అధికారపూర్వక హెబ్రీ గ్రంథము), దినవృత్తాంతమును రచించినవాడు, **జెరుబ్బాబెలు యొక్క తండ్రి** "పెదయా" అని ప్రస్తావించుచున్నాడు (1 దినవృత్తాంతములు 3:19) కానీ సెప్టుజింట్ "షయల్తీయేలు" అని ప్రస్తావించుచున్నది. ఈ రెండవ గమనిక ఇతర గ్రంథ వాక్య భాగాలతో ఏకీభవించుచున్నది (ఎజ్రా 3:2, 8; నెహెమ్యా 12:1; హగ్గయి 1:12, 14; 2:2, 23). "ఈ సాంప్రదాయములను సామరస్యము గావించుటకు ఎక్కువ సలహాలు ఇవ్వబడినవి; ఇవన్నీ కూడ జెరుబ్బాబెలును పెదయా యొక్క అసలు కుమారునిగా పేర్కొనుచు అతనిని షయల్తీయేలుతో, మరణించిన సహోదరుని విధవరాలైన భార్యను బ్రతికి యున్న సహోదరుడు వివాహమాడుట వంటి ఏదో ఒక చట్టపరమైన సంబంధముతో జోడించుచున్నవి"[24] (ద్వితీయోపదేశకాండము 25:5-10తో పోల్చి చూడుము). లూకా సమకూర్చుచున్న యేసు క్రీస్తు వంశావళి, మత్తయి ప్రస్తావించుచున్న పంథాను "దావీదు" తరువాత తప్పించి ప్రక్క మార్గములో వెళ్లుచున్నట్లున్న వంశావళి, "షయల్తీయేలు" మరియు "జెరుబ్బాబెలు" యొద్ద మరల జోడించుచున్నది, అయితే మళ్లీ దాని మార్గమున అది వెళ్లుచున్నది (లూకా 3:27, 31).

క్రీ.పూ. 538లో పారసీక దేశపు రాజైన కోరెషు చేత ఒక శాసనము జారీ చేయబడిన తదుపరి చెర నుండి యెరూషలేమునకు తిరిగి వచ్చిన యూదులలో జెరుబ్బాబెలు కూడ ఉండెను (ఎజ్రా 1:1-2:2) సాంప్రదాయ ప్రకారము అతడు యెరూషలేమునకు తిరిగి వచ్చిన వారికి ఒక నాయకుడుగా ఉండెనని పరిగణింపబడుచుచున్నాడు, మరియు "యూదులకు అధిపతి, షేష్బజ్జరు" అని గుర్తింపబడుచున్నాడు (ఎజ్రా 1:8). ఏదిఏమైనా, షేష్బజ్జరు మరియు జెరుబ్బాబెలు - ఈ ఇద్దరు కూడ వేరు వేరు వ్యక్తులై యుందురు, ఈ లెక్క చొప్పున ఇది జెరుబ్బాబెలును "యూదా దేశపు రెండవ అధికారిగా" చేయుచున్నది (హగ్గయి 2:21). దేవుడు జెరుబ్బాబెలును "ముద్ర యుంగరముగా" పోల్చుట (హగ్గయి 2:23), ఇది రాజరికమునకును అధికారమునకును చిహ్నమై యున్నది, బహుశా దావీదు సంతానమందు వాగ్దానం చేయబడిన మెస్సీయ గూర్చి పునరుద్ఘాటించుచుండవచ్చును.[25]

**వచనములు 13-15 జెరుబ్బాబెలు** తరువాత, తొమ్మిది పేర్లు మాత్రమే దాదాపు ఐదు

వందల సంవత్సరముల కాలమును చుట్టివచ్చుచున్నవి: **అబీహోదు, ఎల్యాకీము, అజోరు, సాదోకు, ఆకీము, ఎలీహోదు, ఎలియాజరు, మత్తాను, మరియు యాకోబు.** కాబట్టి, ఇవ్వబడిన వంశావళిలో ప్రతి తరమునకు కూడ ప్రాతినిధ్యం ఉన్నదనునది సంశయాత్మకమైన సంగతై యున్నది. ఈ పురుషులందరి పేర్లు పాత మరియు క్రొత్త నిబంధనల మధ్య కాలములో (అంతర్నిబంధనల కాలములో) జీవించి యుండిరి. వంశావళికి సంబంధించిన ఈ రికార్డును మత్తయి మరొక మూలము నుండి సంపాదించి యుండును. యూదీయ చరిత్రకారుడు జోసెఫస్, ఒక యాజక కుటుంబములో నుండి వచ్చినవాడు, "ప్రజా రికార్డులలో వర్ణింపబడి యుండిన విషయాలను" ఆయన కనుగొనిన వాటి ఆధారంగా తన వంశావళిని స్థాపించుకొనుట ద్వారా తన స్వీయ చరిత్రను రాయుటకు మొదలు పెట్టాడు.[26] దావీదు యొక్క రాజరికపు సంతానము గూర్చి సహితము యూదీయ ప్రజలు ఆందోళన చెందియుందురనునది సంభావ్యమైనట్లు కనిపించుచున్నది. మత్తయి తన సమాచారమును ప్రజా రికార్డులలో నుండి లేదా యేసు యొక్క సొంత కుటుంబ సభ్యుల నుండి సంపాదించి యుండును. నిశ్చయంగా, ప్రజా సంఖ్యలో రాయబడుటకు యోసేపు మరియను బేత్లెహేమునకు, అనగా దావీదు పురమునకు, తీసుకొని వెళ్లుచుండగా తన సొంత వంశావళి ఏమైయుండినదో యోసేపు ఎరిగినవాడై యుండును (లూకా 2:1-7).

**వచనము 16.** యేసు క్రీస్తు వంశావళి గూర్చి మత్తయి సమకూర్చిన వివరములలో **యోసేపు,** యేసు యొక్క ఇహలోక తండ్రి, **యాకోబు** అను వాని కుమారుడై యుండెనని తెలియజెప్పబడుచున్నది. యోసేపు, హేలీ కుమారుడై యుండెనని లూకా పేర్కొనుచున్నాడు (లూకా 3:23). ఊహించుకొనబడుచున్న పొంతనలేని ఈ భిన్నత పొసగునట్లు ఎలా చేయబడగలదు? మత్తయి సమకూర్చుచున్న వంశావళిలో, వంశావళులకు సంబంధించిన అనేక వెలుతులున్నవని ఋజువుచేయబడినది, గనుక ఈ తేడాను ఇది వివరించగలదు. యోసేపు యాకోబు యొక్క రక్తసంబంధియైన కుమారుడును, మరియ తండ్రియైన హేలీ యొక్క అల్లుడునై యుండుననునది కూడ సాధ్యమే. ఈ రెండు వంశావళుల మధ్య గల తేడాలను ఇది పరిష్కరించుచున్నది. ఇంకా, ఈ వంశావళులు ఎవ్వరికి సంబంధించినవై యున్నవోయను విస్తృతమైన సమ్మకముతో కూడ ఇది ఏకీభవించుచున్నది.[27] ఏలాగైతేనేమి ఈ రెండు సందర్భములలోను, యోసేపు మరియు మరియ – ఈ ఇరువురు కూడ దావీదు వంశస్థులై యుండిరి.

ఈ సందర్భములో మత్తయి తగు జాగ్రత్త వహించాడు గనుక "యోసేపు యేసును కనెను" (యోసేపు యేసు యొక్క తండ్రియై యుండెను) అని ఆయన చెప్పలేదు. **ఆమె భర్తయైన యోసేపు** అని యోసేపు గూర్చి, **ఆయన తల్లియైన మరియ** అని మరియ గూర్చి మత్తయి ఉద్ఘాటించి చెప్పాడు. ఈ భాష అద్భుతకరముగా కన్యక గర్భము దాల్చుట మరియు యేసు జన్మించుటకు మార్గమును సరాళము చేయుచున్నది (1:18-25).

యేసు **మెస్సీయ** లేదా "క్రీస్తు" అని ప్రస్తావింపబడుచున్నాడు. ఈ చివరి విభాగములో (1:12-16) పేర్కొనబడిన దావీదు యొక్క ఇతర వారసులు రాజులుగా పరిపాలించకపోయినప్పటికిని, యేసు పరిపాలించుచున్నాడు. ఏదిఏమైనా, ఆయన దావీదు సింహాసనముపై ఆసీనుడై రాజ్యమేలుట అది ఆధ్యాత్మిక విషయమై యున్నది. ఆయన పరలోకమందు, ఎన్నటికిని నాశనము చేయబడక చిరకాలము నిలిచియుండు ఒక శాశ్వత

రాజ్యమును నేలుచున్నాడు (అపొస్తలుల కార్యములు 2:29–36; దానియేలు 2:44; 7:13, 14 చూడుము).

## సారాంశము (1:17)

**[17]ఇట్లు అబ్రాహాము మొదలుకొని దావీదు వరకు తరములన్నియు పదునాలుగు తరములు. దావీదు మొదలుకొని యూదులు బబులోనుకు కొనిపోబడిన కాలమువరకు పదునాలుగు తరములు; బబులోనుకు కొనిపోబడినది మొదలుకొని క్రీస్తు వరకు పదునాలుగు తరములు.**

**వచనము 17.** ఈ వచనము యేసు క్రీస్తు వంశావళికి ఒక సారాంశముగా ఉపయోగపడుచున్నది. గ్రంథంలోని వాక్యభాగమంతటిలో ఇది చుట్టుముట్టుచు, మొదటి వచనము ప్రతిబింబించుచున్నది. మొదటి వచనంలో పేర్లు నమోదు చేయబడిన క్రమము ("యేసు క్రీస్తు," "దావీదు," మరియు "అబ్రాహాము") 17వ వచనంలో తిరుగరాయబడి యున్నది ("అబ్రాహాము," "దావీదు," మరియు "క్రీస్తు"). ఇంతమాత్రమేగాక, వంశావళి మూడు విభాగములుగా విభాగింపబడినది, ప్రతి ఒక్క విభాగములో **పదునాలుగు తరములున్నవి.**

1. **అబ్రాహాము మొదలుకొని దావీదు వరకు తరములన్నియు పదునాలుగు తరములు** (1:2–6ఎ);
2. **దావీదు మొదలుకొని బబులోనుకు చెరగా కొనిపోబడువరకు తరములన్నియు పదునాలుగు తరములు** (1:6బి–11);
3. **బబులోనుకు చెరగా కొనిపోబడినది మొదలుకొని మెస్సీయ వరకు తరములన్నియు పదునాలుగు తరములు** (1:12–16).

జాక్ పి. లూయిస్, అనేక ఇతర పండితులతో కూడ, "కంఠస్థం చేయుటకు సులభముగా నుండునట్లు" ఇలా రాయబడినదని సూచించుచున్నాడు.[28] ఇంకా, ఈ ఏర్పాటు యూదీయ చరిత్ర యొక్క మూడు కాలముల గూర్చి ఒక సారాంశము కూడ సమకూర్చుచున్నది.

దావీదు పేరులో గల సంఖ్యా సంబంధమైన సమానత్వము పదునాలుగై యున్నదను వాస్తములో కొందరు ఒక ప్రాముఖ్యతను గమనించారు (హెబ్రీ భాషలోని హల్లులతో ఈ పేరు "DWD" గా ప్రతిలేఖనము చేయబడినది). ("D" హెబ్రీ అక్షరమాలలో నాలుగవ అక్షరమై యున్నది, మరియు "W" ఆరవ అక్షరమై యున్నది: 4+6+4=14.) ఈ దృష్టికోణం "ఒక ఋజువై యుండుటకుగాని లేదా ఖండింపబడుటకుగాని సరిపోని విస్తృతముగా అంగీకరింపబడిన ఒక అభిప్రాయమై యున్నదని" లూయిస్ సూచించుచున్నాడు.[29]

మూడు విభాగములుగా చేయబడిన ఈ ఏర్పాటు, ప్రతి ఒక్క విభాగము పదునాలుగు తరములు కలిగియుండి, క్రీస్తు రాకడ కొరకైన సిద్ధపాటు సమయము సంపూర్తియై పోయిందని చూపించుచున్నది (గలతీయులకు 4:4 చూడుము). ఏదిఏమైనా, చివరి విభాగమును (1:12–16), లెక్కించుటలో ఒక చిన్న చిక్కున్నది, అదేమనగా ఇందులో పదునాలుగు పేర్లకు బదులుగా పదమూడు పేర్లున్నట్లు కనిపించుచున్నది. ఈ సమస్యకు పరిష్కారములు

నివేదింపబడి యుండెను, కానీ వాటిలో ఏ ఒక్కటైనను సంపూర్తిగా సంతృప్తికరంగా లేదు.

యెకొన్యాను, రెండవ విభాగములోనికి (1:11, 12). తీసుకొనబడిన వానిని, ఈ లెక్కలోనికి తీసుకొనుట ఒక పరిష్కారమై యున్నది. అట్లయినప్పటికిని, దావీదు, మొదటి విభాగము నుండి రెండవ విభాగములోనికి (1:6ఎ, 6బి), తీసుకొనబడి యున్నాడు, గనుక ఆయన రెండవ సారి కూడ లెక్కలోనికి తీసికొనబడలేదు.

పదనాలుగు తరములు వచ్చునట్లు లెక్కల్లో మరియను కలుపుకొనుట మరొక పరిష్కారమై యున్నది. ఏదిఏమైనా, వంశావళిలోని ఏ ఒక్క స్త్రీయైనను లెక్కల్లోనికి తీసుకొనబడలేదు. గనుక మరియ, ఆమె పరిణయమాడిన యోసేపునకు భిన్నమైన తరమునకు ప్రతినిధిగా ఉంటుందని నమ్ముట కష్టమే.

రెండవ విభాగము చివరలో నున్న "యెకొన్యా" అను పేరు, "యెహోయాకీము" (లేదా బహూశా "ఎల్యాకీము," 2 రాజులు 23:34–24:6) అని చదువుకొనబడవలెను, తద్వారా యెకొన్యా పేరు మూడవ విభాగములో లెక్కింపబడును, అప్పుడు అది పదునాలుగు తరములగుననునది మూడవ ప్రతిపాదనయై యున్నది.[30] అట్లయినప్పటికిని, రెండవ వెవ్వేరు పేర్ల విషయంలో గ్రంథ పాఠ్య ఋజువు బలహీనముగా నున్నది. ఇంతేగాక, ఈ ప్రతిపాదన అంగీకరింపబడినట్లయితే, వంశావళిలోని ప్రతి ఒక్కరి పేరు పునరుచ్చరింపబడుట వలన దాని అనురూపము విరుగగొట్టబడినదగును.

✧✧✧✧✧ **పాఠములు** ✧✧✧✧✧

## నిష్ప్రయోజనకరమైన వచనములు? (1:1–17)

అనేక మంది బైబిల్ విద్యార్థులు మత్తయి 1:1–17లో గల వంశావళిని పైపై మెరుగులతో దృష్టించుదురు. ఎంతైనా, వంశావళి జాబితాలో పేర్కొనబడిన కొందరు వ్యక్తులు సుపరిచితులు కారు, గనుక తరుచుగా అట్టి పేర్లను ఉచ్చరించుటకు కష్టంగా ఉంటుంది. అట్లయినను, ఈ వంశావళి నేడు మనకు కొన్ని ప్రాముఖ్యమైన పాఠాలు నేర్పించుచున్నది.

1. దేవుడు తన వాగ్దానములను మన సమయం ప్రకారముగాక, తన సొంత సమయంలో నెరవేర్చును.
2. దేవుని ప్రజలు ఆయనకు విరోధముగా తిరుగుబాటు చేసినప్పుడు ఆయన వారిని శిక్షించును.
3. దేవుడు తన చిత్తమును నెరవేర్చుకొనుటకు పాపిష్ఠి ప్రజలను సహితము వాడుకొనగలడు.
4. దేవుడు ఒకని తలి దండ్రులు పాపములను వానికి విరోధముగా పరిగణించదు.
5. దేవుడు ఇశ్రాయేలును వ్యవస్థాపించి, వారిని సంరక్షించుటలో క్రీస్తును ఈ లోకములోనికి తెచ్చుట ఆయన ప్రధాన ఉద్దేశమై యుండినది.[31]

## వంశావళిలోని స్త్రీలు (1:1–17)

క్రీస్తు వంశావళిలో ప్రస్తావించిన ఐదు మంది స్త్రీలను ఉపయోగించి ఒక ప్రసంగమును సిద్ధపరచుకోవచ్చు.

1. తామారు – తిరస్కరింపబడిన స్త్రీ (1:3; ఆదికాండము 38:6–30);

2. రాహాబు – విశ్వాసిగా మారిన వేశ్య (1:5; యెహోషువ 2:1–21);

3. రూతు – విశ్వాసనీయమైన కోడలు (1:5; రూతు 1–4);

4. బత్షెబ – విశ్వాసఘాతుకరాలైన భార్య (1:6; 2 సమూయేలు 11:12);

5. మరియ – దేవుడు ఆయన కుమారుని నిమిత్తము ఏర్పరచుకొనిన జనని (1:16; చూడుము 1:18–25; 12:46–50; లూకా 1:26–56; 2:1–52; యోహాను 2:1–11; 19:25–27).[32]

---

సూచనలు

[1]Douglas S. Huffman, "Genealogy," in *Dictionary of Jesus and the Gospels,* ed. Joel B. Green and Scot McKnight (Downers Grove, Ill.: InterVarsity Press, 1992), 255. [2]Macrobius *Saturnalia* 2.4.11. [3]Eusebius *Ecclesiastical History* 1.7.13. [4]యోసేపు పేరు రెండు జాబితాలలో పేర్కొనబడి యుండగా మరియ పేరు లూకా రాసిన సువార్తలోని వంశావళిలోనైనను పేర్కొనబడలేదను వాస్తవము ఈ దృక్పథముతో ఏర్పడుచున్న కష్టములలో ఒకటైయున్నది. [5]Jack P. Lewis, *The Gospel According to Matthew,* Part 1, The Living Word Commentary (Austin, Tex.: Sweet Publishing Co., 1976), 35. [6]Donald A. Hagner, *Matthew 1-13,* Word Biblical Commentary, vol. 33A (Dallas: Word Books, 1993), 9. [7]Douglas R. A. Hare, *Matthew,* Interpretation (Louisville: John Knox Press, 1993), 6. [8]Leon Morris, *The Gospel According to Matthew,* Pillar Commentary (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1992), 20. [9]Huffman, 255. [10]David Hill, *The Gospel of Matthew,* The New Century Bible Commentary (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1972), 75.

[11]అనేక వంశావళుల జాబితాలో పురుషుల పేర్లు మాత్రమే రాయబడి యున్నవి. ఏదిఏమైనా, ఇట్టి వంశావళుల జాబితాలో స్త్రీలు సహితము నమోదు చేయబడిన ఉదాహరణములు పాత నిబంధనలో కలవు (ఆదికాండము 22:20–24; 25:1–6; 36:1–14; 1 దినవృత్తాంతములు 1:32; 2:3, 4, 18–20, 24, 26, 46; 3:1–9). కొన్ని సందర్భములలో, తండ్రి ఒక్కరి కంటె ఎక్కువ మంది భార్యలు/ఉంపుడుగత్తెలు కలిగియుండెను, గనుక కుమారులను వర్గీకరించుట ఈ స్త్రీల పేర్లును పేర్కొనుటలో గల ఉద్దేశమై యుండినది. [12]Huffman, 255–56. [13]Lewis, 39. [14]Huffman, 256. [15]Robert H. Gundry, *Matthew: A Commentary on His Literary and Theological Art* (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1982), 15. [16]William Hendriksen, *New Testament Commentary: Exposition of the Gospel According to Matthew* (Grand Rapids, Mich.: Baker Book House, 1973), 116. [17]J. W. McGarvey, *The New Testament Commentary,* vol. 1, *Matthew and Mark* (N.p., 1875; reprint, Delight Ark.: Gospel Light Publishing Co., n.d.), 16. [18]"ఉజ్జియా" ఏ రాజును సూచించుచున్నదోయను విషయమునకు సంబంధించినంత వరకు వాదోపవాదమున్నది. కొందరు అహజ్యా అని అందురు, కానీ అజర్యా రాజు దీనికి అతి సమీపంగా ఉన్నాడు (2 రాజులు 14:21; 15:13, 30 చూడుము). [19]అతనికి ముందు ఎల్యాకీము సహోదరుడును యెహోయాహాజు – యేసుక్రీస్తు వంశావళిలో భాగస్థుడు కాదు– మూడు సంవత్సరములు పరిపాలించాడు, కానీ నెకో అతనిని పదవీచ్యుతుణ్ణి గావించాడు (2 రాజులు 23:31–33). [20]చెరగా పట్టబడినవారు యెరూషలేము నుండి బబులోనుకు కొనిపోబడిన నాలుగు సందర్భములుండినవి (దానియేలు 1:1–7; యిర్మీయా 52:28–30): (1) క్రీ.పూ. 605లో దానియేలు, (2) క్రీ.పూ. 597లో యెకొన్యా, (3) క్రీ.పూ. 586లో సిద్కియా కొనిపోబడిరి మరియు (4) క్రీ.పూ. 582ల గవర్నరు గెదల్యా దొంగ చాటుగా చంపబడి కొనిపోబడెను.

[21]Hagner, 11.[22]McGarvey, 21. [23]నెబకద్నెజరు పరిపాలించిన కాలమునాటి బబులోను గ్రంథ పాఠము రాజ గృహము ద్వారా పోషింపబడుచుండిన వారికి, "యూదా రాజు యొక్క ఐదుగురు కుమారులతో కూడ ఇతరులకు" ఇవ్వబడిన నిత్యావసర వస్తువుల జాబితా నిచ్చుచున్నది. (James B. Pritchard, ed., *Ancient Near Eastern Texts: Relating to the Old Testament,* 3d. ed. [Princeton, N.J.: Princeton University Press, 1969], 308.) [24]H. G. M. Williamson, "Zerubbabel," in *The International Standard Bible Encyclopedia,* rev. ed., ed. Geof-

frey W. Bromiley (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1988), 4:1193. [25]దీనికి భిన్నముగా, అతడు "ఆయన [దేవుని] కుడి చేతిపై ముద్ర యుంగరమై" యున్నప్పటికిని, ఆయన అతనిని ఊడదీయునని దేవుడు యెకొన్యాకు (యెకొన్యా, యహోయాకీను) సెలవిచ్చాడు (యిర్మీయా 22:24). [26]Josephus *Life 1.1-6; see Against Apion 1.7.* [27]ఇదివరకే తెలియజెప్పినట్లు, మత్తయి సువార్త మొదటి అధ్యాయం యోసేపు వంశావళి జాడ తీయుచున్నదనియు, లూకా సువార్త మూడవ అధ్యాయం మరియ యొక్క వంశావళి జాడ తీయుచున్నదనియు అనేకులు నమ్ముదురు. [28]Lewis, 36. [29]Ibid., 37. ఈ అభ్యాసమునకు గల సాంకేతిక నామము "Gematria"యై యున్నది. ఇది ప్రకటన 13:17, 18లో వాడబడి యుండవచ్చు Gematria యొక్క స్పష్టమైన ఉదాహరణము *Barnabas* 9.8లో చూడనగును. [30]Hagner, 5-6 చూడుము.

[31]Based on Jack Wilhelm, "The Bible's Useless Verses," *RSVP* Newsletter 49-12-80-12 (1980). Used by permission of Jack Wilhelm, P.O. Box 2222, Florence, AL 35630. [32]Ibid.